సాక్షి
మహబూబాబాద్
మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



ప్రతీ బస్తా కొనుగోలు చేస్తాం
రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట ఉత్పత్తుల ప్రతీ బస్తాను కొనుగోలు చేస్తామని మంత్రి కొండా సురేఖ అన్నారు. - 8లో



రామప్ప ఆలయ ఖ్యాతిని చాటాలి
రామప్ప ఆలయ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.9°/22.3°
వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

లాభాల బాట

నష్టాలను అధిగమించిన మానుకోట ఆర్టీసీ డిపో

- పండుగలు, చాలెంజ్ కార్యక్రమాల్లో ముందు వరుసన
- ఉచిత ప్రయాణంతో పెరుగుతున్న మహిళా ప్రయాణికుల సంఖ్య



మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్

నెహ్రూసెంటర్: జిల్లాలోని ఆర్టీసీ మానుకోట డిపో నష్టాలను అధిగమించి లాభాల బాటలో పయనిస్తోంది. వివిధ రూట్లలో సర్వీస్‌లు పెంచడం, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంతో లాభాలు వస్తున్నాయి. అలాగే సంస్థ వినూత్న కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేపట్టిన పథకాల ద్వారా అత్యధిక ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతూ ఆర్థిక పరిపుష్టి సాధిస్తోంది.

డిపోలో...
మానుకోట డిపోలో మొత్తం 67 బస్సులు ఉండగా ప్రతీరోజు వివిధ మార్గాల్లో 25 వేల కిలోమీటర్లు తిరుగుతూ 98 శాతం ఆక్యూపెన్సీతో 13.5 లక్షల ఆదాయం వస్తోంది. డిపో నుంచి ఖమ్మం, హనుమకొండ, వరంగల్, నర్సంపేట, హైదరాబాద్, తొర్రూరుతో పాటు ఇతర ప్రాంతాలకు బస్సు సర్వీస్‌లను నడిపిస్తోంది. రెండేళ్ల క్రితం రూ.22 కోట్ల ఆదాయం, రూ.12 కోట్ల నష్టాల్లో ఉండగా.. ప్రస్తుత ఏడాది సుమారు రూ. 37.87కోట్ల ఆదాయంతో లాభాల బాటలోకి పయనిస్తుంది. దీంతో పాటు రూ.1.50కోట్ల నష్టం ఉంది. సరిపడా బస్సులు లేకపోయినప్పటికీ ప్రయాణికుల సౌకర్యార్థం సర్వీస్‌లు వేస్తున్నారు. పండుగలు, ప్రత్యేక చాలెంజ్ కార్యక్రమాల్లో మానుకోట డిపో ముందుంటోంది.

పెరిగిన ప్రయాణికుల సంఖ్య...
రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం ప్రారంభించిన నాటి నుంచి ప్రయాణికుల తాకిడి పెరిగింది. మహబూబాబాద్ డిపో నుంచి ఇతర ప్రాంతాలకు ప్రతీ రోజు 34 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. దీంతో వందశాతం ఆక్యూపెన్సీతో డిపో పరుగులు పెడుతోంది. దీంతోపాటు విహారయాత్రలు, పెళ్లిళ్లు, తీర్థయాత్రలకు బస్సులను అద్దెకు ఇస్తూ మరికొంత ఆదాయాన్ని ఆర్టీసీ ఆర్జిస్తుంది.

పండుగలు, చాలెంజ్ కార్యక్రమాల్లో..
పండుగలు, ప్రత్యేక ఆర్టీసీ చాలెంజ్ కార్యక్రమాల్లో బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం నడుపుతూ వరంగల్ రీజియన్ పరిధిలో మానుకోట ఆర్టీసీ డిపో ముందు వరుసలో ఉంటుంది. దసరా పండుగకు 96 ప్రత్యేక బస్సులను నడపడం ద్వారా సుమారు రూ. 28 లక్షల ఆదాయాన్ని ఆర్జించి వరంగల్ రీజియన్‌లో రెండోస్థానంలో నిలిచింది. దీంతో పాటు ప్రతీ పండుగకు ప్రత్యేక బస్సులను నడిపించేలా డిపో అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కొత్త బస్సులొస్తే మరింత ఆదాయం...
మహబూబాబాద్ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు బస్సులను నడిపించాలని అధిక మొత్తంలో వినతులు వస్తున్నాయి. గతంలో ఉన్న రూట్లలో నడుస్తున్న బస్సులను ప్రస్తుతం ప్రయాణికుల సౌకర్యార్థం వాటిని మరోరూట్లలో నడిపిస్తున్నారు. దీంతో ప్రయాణికుల అవసరం మేరకు డిపోలో ఉన్న 67 బస్సులతో పాటు మరో 15 బస్సులను అందుబాటులో ఉంచితే మరికొంత ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

సమష్టి కృషితోనే..



ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను నడుపుతూ సమష్టి కృషితో డిపో లాభదాయంగా మారుతుంది. ప్రయాణికుల రద్దీ ఆధారంగా బస్సులను నడుపుతున్నాం. ప్రయాణికులు ఆర్టీసీని ఇదే రీతిన ఆదరించి డిపో అభివృద్ధికి కృషి చేయాలి. పండుగలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. విహారయాత్రలు, పెళ్లిళ్లకు అద్దె బస్సులను ఆర్టీసీ అందజేస్తుంది.

- ఎం.శివప్రసాద్, ఆర్టీసీ డీఎం, మహబూబాబాద్

పోలీసుల సేవలు మరువలేనివి







అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న కలెక్టర్



నివాళులర్పిస్తున్న అధికారులు

- పోలీసు అమరులకు కలెక్టర్, ఎస్పీ నివాళి

మహబూబాబాద్ రూరల్: శాంతి భద్రతలను పరిరక్షించడంతో పాటు ప్రజలకు పోలీసులు అందిస్తున్న సేవలు మరువలేనివని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. పరేడ్ కమాండర్ అనిల్ ఆధ్వర్యంలో స్మృతి పరేడ్ నిర్వహించగా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ముఖ్య అతిథులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులను ఎంత స్మరించుకున్నా తక్కువేనన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన 214 మంది పోలీసు అధికారులు ఉగ్రవాదులు, తీవ్రవాదులతో పోరాడి దేశ రక్షణ కోసం అమరులయ్యారని విచారం వ్యక్తం చేశారు. పోలీసు అమరవీరుల త్యాగాలను మనమందరం అనుక్షణం సంస్మరించుకుంటూ.. దేశ రక్షణ కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఆకాంక్షించారు. ఈనెల 21నుంచి వారం రోజులపాటు పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య దేశ వ్యాప్తంగా అమరులైన పోలీసు అధికారుల పేర్లు చదివి నివాళులర్పించి మాట్లాడారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఇటీవల వచ్చిన వరదల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలను రక్షించారని కొనియాడారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల అధికారులు, పోలీస్ అధికారులు పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల డీఎస్పీలు తిరుపతిరావు, మోహన్, శ్రీనివాస్, విజయప్రతాప్, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలి



మహబూబాబాద్: యుద్ధప్రాతిపదికన ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు జాబితా రూపకల్పనపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రణాళికబద్ధంగా ఓటరు జాబితా సవరణ, స్వీప్ కార్యక్రమాల నిర్వహణ పూర్తి చేయాలన్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 2,730 ఓటరు నమోదు దరఖాస్తులు వస్తే అన్ని పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఓటరు జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలన్నారు. వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఆర్డీఓలు అలివేలు, నర్సింహారావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భారతదేశ ఖ్యాతిని చాటాలి



మరిపెడ రూరల్: పట్టుదలతో ప్రపంచ రికార్డుస్థాయి పర్వతాలను అధిరోహించి భారతదేశ ఖ్యాతిని చాటాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ అన్నారు. మరిపెడ మండలం భూక్యతండా గ్రామ పంచాయతీకి చెందిన మౌంటైనర్ భూక్య యశ్వంత్ ఆయనను హైదరాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు ఫొటో ఫ్రేమ్‌ను అందించాడు. అనంతరం యశ్వంత్ సాధించిన విజయాలను ప్రశంసిస్తూ కమిషనర్ అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించి భారత దేశ కీర్తిని చాటి చెప్పాలను యశ్వంత్‌కు సూచించారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకే కొత్తలైన్



నెల్లికుదురు: రైతులతో పాటు గృహవినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకే నూతన లైన్ ఏర్పాటు చేసినట్లు ఎన్పీడీసీఎల్ మహబూబాబాద్ ఎస్ఈ నరేష్ అన్నారు. నెల్లికుదురు సబ్‌స్టేషన్ నుంచి మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామ శివారు రామానుజాపురం గ్రామ పరిధిలో 33/11కేవీ సబ్‌స్టేషన్ వరకు రూ.51లక్షలతో చేపట్టిన 33కేవీ నూతన లైన్‌ను సోమవారం విద్యుత్ అధికారులతో కలసి ఎస్ఈ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి నుంచి నెల్లికుదురులోని 33/11 కేవీ లైన్‌పై ఓవర్ లోడు తగ్గి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు డీఈ మధుసూదన్, ఏడీఈ చలపతిరావు, ఏఈ సింధూ, ట్రాన్స్‌కో ఎస్ఈ రామ్మోహన్‌రావు, డీఈలు శ్రీనివాసరావు, రాచందర్‌రావు ఏఈ రాజిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా ‘భూమి సునీల్’



కురవి: తెలంగాణ వ్యవసాయం, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా మండలంలోని అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన భూమిసునీల్(మేక సునీల్‌రెడ్డి)ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే భూమిసునీల్ ధరణి సమస్యలను పరిష్కరించేందుకు భూ ప్రక్షాళనలో భాగంగా నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని తయారు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రభుత్వం భూమి సునీల్‌కు తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా నియమించింది. ఆయన నియామకంతో జిల్లా వాసులతోపాటు మండల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన జీఎం

భూపాలపల్లి అర్బన్: జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబును ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సేన్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కోర్టు ఆవరణలో జడ్జిని కలిసిన జీఎం పుష్పగుచ్ఛం అందజేసి పెండింగ్‌లో ఉన్న సింగరేణి కేసుల గురించి చర్చించినట్లు జీఎం తెలిపారు.

వినతులు వెంటనే పరిష్కరించాలి

- ప్రజావాణిలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: సత్వర సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అనే విషయాన్ని అధికారులు గుర్తు పెట్టుకుని వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వినతులపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని, పరిష్కారం సాధ్యంకాకపోతే కారణాలతో కూడిన నివేదిక అందజేయాలన్నారు. పెండింగ్ వినతులను కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. 114 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీసీఓ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నర్సింహస్వామి, డిప్యూటీ జెడ్పీ సీఈఓ నర్మద, సివిల్ సప్లయీస్ డీఎంఓ కృష్ణవేణి, డీపీఓ విజయ నిర్మల, ఆర్అండ్ బీ ఈఈ బీమ్లానాయక్, డీఈఓ రాజేశ్వర్, కలెక్టరేట్ ఏఓ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చిన వినతుల్లో కొన్ని..

- తొర్రూరు మండలం కంఠాయపాలెం గ్రామానికి చెందిన కె.భారతమ్మ తన భూమి సర్వే చేయించి హద్దులు పెట్టాలని వినతి అందజేశారు.
- ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన బి.శంకరయ్య తనకు పక్షవాతం వచ్చిందని, సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని వినతిలో పేర్కొన్నారు.
- జిల్లా కేంద్రానికి చెందిన అహ్మద్ తనకు పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు ఇచ్చారు.
- నెల్లికుదురు మండలం రావిరాల గ్రామానికి చెందిన డి.శ్రీలత తనకు బోదకాలు ఉందని,పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.
- మానుకోట మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన కిషన్ రుణమాఫీ చేయాలని వినతిలో పేర్కొన్నారు.

పారువేటకు బయలుదేరిన వేంకటేశ్వరుడు



అశ్వవాహనంపై పారువేటకు బయలుదేరిన స్వామివారు

గార్ల: మండలంలోని మర్రిగూడెం ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం వేంకటేశ్వరస్వామి అశ్వవాహనంపై పారువేటకు సమీపంలోని అడవికి బయలుదేరారు. కల్యాణం, తెప్పోత్సవం అనంతరం స్వామివారు పారువేటకు వెళ్లారు. ఈక్రమంలో స్వామివారు బొడ్డులో ఉన్న తన కత్తితో గొర్రెపోతు చెవులు కోసి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం దేవాలయంలో స్వామివారికి అర్చకులు అచ్యుతాచార్యులు, గోవిందాచార్యులు పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈఓ సమత, ఐఆర్‌టీఎస్ రిటైర్డ్ అధికారి భూక్య కస్నానాయక్, బి.హరినాయక్, మాజీ ఎంపీపీ బి.లాలునాయక్, బోజ్యానాయక్, చిరంజీవి, కోట శ్రీనివాస్, సత్యం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎస్‌ఏ-1 పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సోమవారం సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ-1) పరీక్షలు ప్రారంభమైనట్లు డీఈఓ రాజేశ్వర్ తెలిపారు. పరీక్షలు ఈనెల 28వరకు కొనసాగుతాయని, ఈ ఏడాది సైన్స్‌లో రెండు పేపర్లు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 7, 9వ తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం1.15 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు ఉంటాయని, మిగతా తరగతుల విద్యార్థులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఫలితాలు నవంబర్ 2న వెల్లడించి.. 16న తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- అదనపు డీసీపీ సంజీవ్



మాట్లాడుతున్న అదనపు డీసీపీ సంజీవ్

హన్మకొండ అర్బన్: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని అదనపు డీసీపీ సంజీవ్ అన్నారు. సోమవారం వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ కళాశాలలోని సంస్కృతం, హిందీ విభాగాల ఆధ్వర్యాన ‘ఎ స్టడీ ఆఫ్ ఉమెన్ క్యారెక్టర్స్ ఇన్ రామాయణ అండ్ ఇట్స్ రిలవెన్స్ ఇన్ మోడ్రన్ ఎరా’ అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సును ప్రారంభించి మాట్లాడారు. స్త్రీలు సమాజ సృష్టికర్తలని, వారి సహనం, ఓపిక, మంచితనం, కష్టపడే తత్వం చాలా గొప్పదని అన్నారు. అనంతరం 60 మంది రాసిన పరిశోధక పత్ర వ్యాసాలను ఐఎస్‌బీఎన్‌తో సావనీర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి, కేయూ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సంజీవ, కేడీసీ సంస్కృత విభాగం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణయ్య, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మమత, కళాశాల సంస్కృత విభాగాధిపతి రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సువాసిని, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఈ-నామ్ సర్వర్ డౌన్.. రోడ్డెక్కిన రైతులు

- మానుకోట, కేసముద్రం మార్కెట్లలో వేలంపాటల ద్వారా కొనుగోళ్లు



మహబూబాబాద్ రూరల్: వైఎస్సార్ సెంటర్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు



కేసముద్రం మార్కెట్‌లో పడిగాపులు పడుతున్న రైతులు




కేసముద్రం మార్కెట్‌లో మాన్యువల్‌గా రాసిచ్చిన లాట్‌నంబర్ చీటీ

మహబూబాబాద్ రూరల్: ఈ-నామ్ సర్వర్ డౌన్ కారణంగా పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో ఆలస్యం కావడంతో రైతన్నలు రోడ్డెక్కి ఆందోళన చేశారు. మానుకోట వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం రైతులు పత్తి, మొక్కజొన్నలు, ఇతర పంట ఉత్పత్తులను విక్రయించేందుకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో కొనుగోళ్లు ప్రారంభమయ్యే సమయానికి ఈ-నామ్ సర్వర్‌లో సమస్య ఏర్పడటంతో వ్యాపారులు పంట ఉత్పత్తులకు ధరలు నిర్ణయించకుండా వెళ్లిపోయారు. దీంతో రైతులు ఆగ్రహంతో సకాలంలో కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ మార్కెట్ ఎదుట వైఎస్సార్ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. వ్యాపారులు కొనుగోళ్లు చేపట్టకపోతే మార్కెట్లోనే పడిగాపులు కాయాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ సెక్రటరీ షంషీర్ వచ్చి రైతులకు ఈ-నామ్ సర్వర్ డౌన్ సమస్యను వివరించినప్పటికీ వారు వెనక్కి తగ్గకుండా కొనుగోళ్లు ప్రారంభించాలని నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి ఇన్‌చార్జ్ డీఎంఓ వెంకటేశ్వర్లు, మార్కెట్ సెక్రటరీ షంషీర్, మార్కెట్ అధికారులు, వ్యాపారులతో చర్చించారు. అనంతరం వ్యాపారులు బహిరంగ వేలంపాటల ద్వారా కొనుగోళ్లు జరిపారు.

కేసముద్రంలో..
కేసముద్రం: ఈ-నామ్ సర్వర్ డౌన్ కారణంగా ఆన్‌లైన్‌లో టెండర్లు నమోదు కాలేదు. దీంతో కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడిన సంఘటన కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చోటుచేసుకుంది. చుట్టుపక్కల గ్రామాల రైతులు మార్కెట్‌కు తమ పంట ఉత్పత్తులు తీసుకురాగా.. ఈ-నామ్ సర్వర్ డౌన్ కారణంగా రైతులకు లాట్ నంబర్లు ఇవ్వలేదు. చివరకు మాన్యువల్‌గా చీటీలపై లాట్ నంబర్లు రాసిచ్చారు. ఆ లాట్ నెంబర్‌ల ఆధారంగా ఆన్‌లైన్‌లో వ్యాపారులు టెండర్లు వేసేందుకు సాయంత్రం వరకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. మధ్యాహ్నం వరకే విన్నర్‌జాబితా రావాల్సి ఉండగా, ఈ-నామ్ సర్వర్ సమస్యతో కొనుగోళ్లు నిలిచిపోగా.. రైతులంతా యార్డులో పడిగాపులు పడ్డారు. చివరకు వ్యాపారులతో మార్కెట్ అధికారులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బహిరంగ వేలంపాటల ద్వారా సాయంత్రం కాంటాలు మొదలు పెట్టారు. రాత్రి వరకు తూకాలు జరిగాయి. కాగా 500 క్వింటాళ్ల మక్కలు, 100 క్వింటాళ్ల పత్తి, 1200 బస్తాల ధాన్యం, 20 క్వింటాళ్ల పెసర్లు అమ్మకానికి వచ్చినట్లు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఓఆర్ఆర్ నిర్మాణంలో 80శాతం వరకు ప్రభుత్వ భూమి ఉందని, మిగతా 20శాతం భూముల యజమానులకు పరిహారం ఇవ్వాలని సీఎంను ఎమ్మెల్యే కోరారు. ఓఆర్ఆర్ పూర్తి చేయడానికి రూ.125 కోట్ల నుంచి రూ.130 కోట్ల వరకు ఖర్చు వస్తుందని, త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరడంతో పాటు ఇందిరమ్మ కమిటీల గురించి చర్చించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంకర అయ్యప్ప రెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ లక్కీ డ్రా విజేతల ఎంపిక

హన్మకొండ: టీజీ ఆర్టీసీ హనుమకొండ నుంచి హైదరాబాద్ రూట్‌లో డీలక్స్ బస్సులో ప్రయాణించే మహిళలకు ప్రవేశ పెట్టిన లక్కీ డ్రా విజేతలను వరంగల్ ఆర్ఎం డి.విజయభాను ప్రకటించారు. సోమవారం హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌లో ఆర్ఎం డ్రా తీసి సానియా అక్తర్ (9959868916), మల్లిక(8501813655), జి.పల్లవి(9701681997)ని విజేతలుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ కేశరాజు భానుకిరణ్, హనుమకొండ, వరంగల్-1 డిపో మేనేజర్లు బి.ధరంసింగ్, వంగల మోహన్‌రావు, అకౌంట్స్ ఆఫీసర్ రవీందర్, అసిస్టెంట్ మేనేజర్ నాజియా సుల్తానా, అలీ, కె.వి.రెడ్డి పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మురళీధర్

మహబూబాబాద్: మాతా,శిశు సంరక్షణ కార్యక్రమాల అమలులో అలసత్వం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ మురళీధర్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం పల్లె దవాఖానాలు, జాతీయ కార్యక్రమాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ.. జాతీయ కార్యక్రమాల అమలులో మానుకోట జిల్లా ముందంజలో ఉందన్నారు. మాతా, శిశు సంరక్షణ కార్యక్రమాల అమలులో జిల్లా వెనుక ఉందన్నారు. జిల్లాలో 12 వారాలలో గర్భిణులను నమోదు చేయాలన్నారు. మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ, ఫైలేరియా వ్యాధులు దోమల వల్ల వ్యాప్తి చెందుతాయని, వాటిని అరికట్టడానికి ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రమీల, డాక్టర్లు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో ఇబ్బందులు
మహబూబాబాద్ అర్బన్: చిన్నారులు, యువత, మహిళల్లో అయోడిన్ లోపం అనేక రుగ్మతలకు దారి తీస్తుందని డీఎంహెచ్‌ఓ మురళీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వికాస్‌జూనియర్ కళాశాలలో సోమవారం ప్రపంచ అయోడిన్ లోపం రుగ్మతల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. అయోడిన్ కలిగిన ఉప్పును మాత్రమే వంటల్లో ఉపయోగించేలా ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయోడిన్ ఉప్పుతో చిన్నారుల్లో పెరుగుదల, చురుకుదనం, మంచి శారీరక మానసిక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి ఉంటుందన్నారు. ఉప్పును పరిమితంగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి నాగేశ్వర్‌రావు, వికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బిక్కి వెంకటేశ్వర్లు, జిల్లా డిప్యూటీ మాస్‌మీడియా అధికారి ప్రసాద్, ప్రిన్సిపాల్ వీరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్లు రాజు, గీత, సబ్‌యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయురాలు ఆదర్శం



కూతురును ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయురాలు సుమతి

దంతాలపల్లి: కాస్త ఆర్థికంగా ఉన్నవారు ప్రభుత్వ బడులను కాదని ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు. అలాంటిది ఓ ఉపాధ్యాయురాలు తాను చదువు చెబుతున్న పాఠశాలలోనే తన కూతురును చేర్పించి ఆదర్శంగా నిలిచారు. మండలంలోని పెద్దముప్పారం పాఠశాలలో నూతన ఉపాధ్యాయురాలు సుమతి ఇటీవల విధుల్లో చేరారు. సొంత గ్రామంలోనే ఎస్జీటీ ఉద్యోగంలో చేరి తన కూతురును అదే పాఠశాలలో చేర్పించారు. ప్రధానోపాధ్యాయుడు కిషన్ నాయక్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయురాలు సుమతి తన కూతురును ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వారికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఇలాంటి నిర్ణయం వల్ల ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయన్నారు.

క్లుప్తంగా

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్‌ : ఐటీఐ ఏటూరునాగారం అడ్వాన్స్‌డ్‌ టెక్నాలజీ సెంటర్‌లో 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు ఉమ్మడి వరంగల్‌ పరిధిలో పదవ తరగతి పాసైన గిరిజన బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న హనుమకొండ గిరిజన భవన్‌లో, 25న మహబూబాబాద్‌ గిరిజన భవన్‌, 26న ములుగు గిరిజన భవన్‌లో అడ్మిషన్ల ఎంపిక కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

పరకాల: నిత్యం మద్యం సేవించడంతో అనారోగ్యం ఏర్పడుతుందని భార్య మందలించినందుకు భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పరకాల పట్టణంలో చోటుచేసుకుంది. పరకాలకు చెందిన మేరుగు మధుసూదన్‌ (35) స్థానికంగా బైక్‌ మెకానిక్‌ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దసరా పండుగ నుంచి రోజూ మద్యం సేవించి ఇంటికి వస్తుండటంపై భార్య మనీషా కోపగించుకుంది. ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన మధుసూదన్‌ను మందలించగా మనస్తాపంతో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సహాయంతో పట్టణంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య మనీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ క్రాంతికుమార్‌ సోమవారం తెలిపారు.

పాఠశాలలో పాము కలకలం



దంతాలపల్లి : మండలంలోని కుమ్మరికుంట్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం పాము కలకలం లేపింది. ఏడో తరగతి గదిలోకి పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయుడు బ్లాక్‌ బోర్డు దగ్గరకు వెళ్లాడు. అప్పటి వరకు కనిపించని పాము బోర్డు దగ్గర గోడ పక్కన కదలడంతో విద్యార్థులు గమనించి ఉపాధ్యాయుడికి చెప్పగా అప్రమత్తమై పామును చంపేశారు. విద్యార్థులు పాము కదలికను చూడడంతో పెనుప్రమాదం తప్పింది.

ప్రహరీ లేకపోవడం వల్లే..

పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో తరగతి గదుల్లోకి పలు మార్లు విషపురుగులు వచ్చాయని ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాజయ్య తెలిపారు. పాఠశాల చుట్టూ చేన్లు ఉండడంతో పాఠశాలల్లోకి పలుమార్లు వచ్చాయని, ఇంతకుముందు చాలా విషపురుగులను గ్రామస్తులు చంపినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రహరీ నిర్మించే వరకు గ్రామ పంచాయతీ అధికారులు పాఠశాల చుట్టూ చెత్త, పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు.

అవి నకిలీ పాస్‌ పుస్తకాలే..

- నిర్ధారించిన ఎఫ్‌ఆర్‌ఓ డోలి శంకర్‌
- బ్యాంకు అధికారులకు సైతం టోకరా
- ఆ పుస్తకాలతో రూ. లక్షల్లో రుణాలు
- పోడు పట్టాల దందాపై 'సాక్షి' కథనానికి కదిలిన యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్‌

ములుగు రూరల్‌: ములుగు జిల్లాలో 'పోడు పట్టాల దందా' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగంలో కదలిక మొదలైంది. ములుగు మండలం అంకన్నగూడెం, కన్నాయిగూడెం, సర్వాపూర్‌, మదనపల్లి, జాకారం, పొట్లాపూర్‌, పెగడపల్లి గ్రామాల్లో అటవీశాఖ అధికారులు శాటిలైట్‌ సర్వే ఆధారంగా సాగులో ఉన్న గిరిజనులకు గత ప్రభుత్వ హయాంలో 463 మందికి పోడు పట్టాలు అందించారు. అయితే అధికారులు జారీ చేసిన పోడుపట్టాలకు ఏమాత్రం తీసిపోకుండా దళారులు నకిలీ పోడు పట్టాలు రూపొందించి అమాయకుల నుంచి డబ్బు కాజేస్తున్నారు. ఈ నకిలీ పోడుపట్టాల దందాపై 'సాక్షి' కథనం ప్రచురించడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

సుమారు రూ. 50 లక్షల నుంచి కోటి వరకు వసూళ్లు..

ములుగు మండలం కాశిందేవిపేట, రామయ్యపల్లి, రాంనగర్‌తండా గ్రామాల్లో పోడు పట్టాలు అందిస్తామని దళారులు అమాయకుల నుంచి సుమారు రూ. 50 లక్షల నుంచి కోటి వరకు వసూళ్లు చేసినట్లు



అటవీశాఖ రేంజ్‌ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి బ్యాంకుకు సమర్పించిన క్లియరెన్స్‌ సర్టిఫికెట్‌

సమాచారం. ఒక్కొక్కరి నుంచి రూ. 40 వేలు తీసుకుని 4 ఎకరాల భూమికి నకిలీ పట్టాలు అందించారు. నకిలీ పాస్‌ పుస్తకాల్లో అటవీ శివారు వేరే మండలాలలో భూములను చూపుతూ గతంలో పోడు పట్టాలు అందించిన పాస్‌ పుస్తకాల్లో సంతకాలు చేసిన కలెక్టర్‌ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్‌, జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్‌ సంతకాలను ఫోర్జరీ చేసి పాస్‌ పుస్తకాలు అందించారు.

నకిలీ పోడు పట్టాలకు బ్యాంకు రుణాలు..

పోడు పట్టాలు పొందిన రైతులు అసలువే అని నమ్మి జంగాలపల్లి యూనియన్‌ బ్యాంకు , జిల్లా కేంద్రంలోని ఏపీజీవీబీలో రుణాలు పొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ వికాస్‌ బ్యాంకులో ఆరుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. లక్షా30



బ్యాంకు నుంచి తీసుకున్న నకిలీ పాస్‌ పుస్తకాలను పరిశీలిస్తున్న అటవీశాఖ రేంజ్‌ అధికారి డోలి శంకర్‌

వేల రుణాలు మంజూరు చేశారు. మరో పది మంది రుణాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. మండల పరిధిలో పోడు పట్టాలు పొందిన రైతుల వివరాలను బ్యాంకు అధికారులకు అందించినప్పటికీ కాసులకు కక్కుర్తి పడి నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు మేనేజర్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్‌లు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

కదిలిన యంత్రాంగం..

అక్రమ పోడు పట్టాలు జారీ చేసిన విషయంపై కలెక్టర్‌ ఆదేశాల మేరకు అటవీశాఖ అధికారులు విచారణ చేపడుతున్నారు. రుణాలు మంజూరు చేసిన బ్యాంకుల నుంచి నకిలీ పాస్‌ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. ములుగు జిల్లా కేంద్రంలో ఏపీజీవీబీ నుంచి ఏడు దరఖాస్తులను స్వాధీనం చేసుకుని పట్టాలు అందించిన దళారి ముఠాగుట్టు రట్టు చేసేందుకు సిద్ధమయ్యారు. బ్యాంకు రుణాలకు కోసం అటవీశాఖ అధికారుల క్లియర్స్‌ సర్టిఫికెట్‌ను కూడా దళారులు ఫోర్జరీ చేసి బ్యాంకులకు సమర్పించారని ఎఫ్‌ఆర్‌ఓ డోలి శంకర్‌ తెలిపారు.

కబడ్డీ విన్నర్‌ ఆర్ట్స్‌ కళాశాల..

- ముగిసిన కేయూ అంతర్‌ కళాశాలల క్రీడలు
- విజేతలకు బహుమతులు అందజేసిన అధికారులు

కేయూ క్యాంపస్‌: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల మైదానంలో మూడురోజులుగా నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ అంతర్‌కళాశాలల వివిధ క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య, ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ ఎస్‌.జ్యోతి,సుబేదారి ఎస్‌బీఐ బ్రాంచీ మేనేజర్‌ అచ్యుత్‌.. ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆ కళాశాల ఫిజికల్‌ డైరెక్టర్‌ భాస్కర్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ పుల్లారమేశ్‌, అధ్యాపకులు గిరిప్రసాద్‌, కుమార్‌, కిరణ్‌, డాక్టర్‌ సోమన్న తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

- కబడ్డీ పోటీల్లో విన్నర్‌గా హనుమకొండ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల , రన్నరప్‌గా ఖమ్మంలోని వర్సిటీ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కళాశాల నిలిచింది.
- ఖోఖో పోటీల్లో విన్నర్‌గా హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీకళాశాల, రన్నరప్‌గా ఖమ్మంలోని ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కళాశాల నిలిచింది.
- సాఫ్ట్‌బాల్‌ విన్నర్‌గా యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌ సైన్స్‌ కళాశాల,రన్నరప్‌గా వాగ్దేవి ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కళాశాల నిలిచింది.
- బాల్‌బ్యాడ్మింటన్‌ పోటీల్లో విన్నర్‌గా వాగ్దేవి డిగ్రీ కళాశాల హనుమకొండ, రన్నరప్‌గా వరంగల్‌లోని సీకేఎం కళాశాల నిలిచింది.
- హ్యాండ్‌బాల్‌పోటీల్లో విన్నర్‌గా సీకేఎం కళాశాల, రన్నరప్‌గా కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కళాశాల నిలిచింది.
- క్రాస్‌కంట్రీ పోటీల్లో విన్నర్‌గా కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ హనుమకొండ, రన్నరప్‌గా తెలంగాణ ట్రైబల్‌ వెల్ఫేర్‌ డిగ్రీ కాలేజీ మరిపెడ నిలిచింది. ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



క్రాస్‌కంట్రీ పోటీల్లో గెలుపొందిన కేడీసీ క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న కేయూ స్పోర్ట్స్‌ బోర్డు సెక్రటరీ వెంకయ్య, ప్రిన్సిపాల్‌ జ్యోతి

ప్రాణం తీసిన ఆన్‌లైన్‌ బెట్టింగ్‌

- అప్పుల్లో కూరుకుపోయి జార్ఖండ్‌ వాసి ఆత్మహత్య

కాళేశ్వరం: ఆన్‌లైన్‌ బెట్టింగ్‌లకు అలవాటుపడిన జార్ఖండ్‌కు చెందిన వ్యక్తి అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి స్నేహితుల కథనం ప్రకారం.. జార్ఖండ్‌ రాష్ట్రం బొకారో జిల్లా బారాషాబాద్‌ మండలం అలోకడికి చెందిన విష్ణు మహత(20) జియోలాజికల్‌ సర్వే డిపార్టుమెంట్‌లో దినసరి లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్‌ బెట్టింగ్‌లకు అలవాటు పడిన అతను అందిన కాడ అప్పులు చేశాడు. ఈనెల 18న మహదేవపూర్‌లోని రూమ్‌ నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతని స్నేహితుడు ధనేశ్వర్‌.. మహత ఆచూకీ కోసం గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో సోమవారం మహదేవపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వెళ్లి పరిశీలించి విష్ణు మహతగా నిర్ధారించారు. మృతదేహం సగం వరకు కుళ్లిపోయింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్‌ తెలిపారు.

24న రైల్వే జీఎంతో ఎంపీల భేటీ

కాజీపేట రూరల్‌ : రైల్వే అభివృద్ధి పనులపై ఈనెల 24న సికింద్రాబాద్‌ రైల్‌ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌ అరుణ్‌కుమార్‌ జైన్‌తో జిల్లా ఎంపీల భేటీ జరగనుందని రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో రైల్వే సమస్యలతో పాటు, నూతన లైన్ల నిర్మాణ ప్రతిపాదనలు, సర్వే అయి పెండింగ్‌లో ఉన్న లైన్ల నిర్మాణం, కాజీపేట వ్యాగన్‌ పీఓహెచ్‌ షెడ్‌, కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ యూనిట్‌, కాజీపేట–విజయవాడ మూడో లైన్‌, తదితర సమస్యలపై రైల్వే జీఎంతో ఎంపీలు చర్చించనున్నట్లు వారు పేర్కొన్నారు.

రామప్ప ఆలయ ఖ్యాతిని చాటాలి

- రాష్ట్ర పంచాయతీ రాజ్‌ శాఖ మంత్రి ధనసరి సీతక్క

వెంకటాపురం(ఎం): రామప్ప దేవాలయ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటాలని రాష్ట్ర పంచాయతీ రాజ్‌ శాఖ మంత్రి ధనసరి సీతక్క వలంటీర్లకు పిలుపునిచ్చారు. రామప్పలో నిర్వహిస్తున్న వరల్డ్‌ హెరిటేజ్‌ వలంటీర్ల క్యాంపును సోమవారం సాయంత్రం సందర్శించి మాట్లాడారు. కాకతీయులు నిర్మించిన రామప్ప దేవాలయం 800 ఏళ్లు దాటిన చెక్కు చెదరకుండా ఉండడంతో పాటు రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడంలో ప్రొఫెసర్‌ పాండురంగారావు కృషిని కొనియాడారు. రామప్పలో శిక్షణ పొందిన వలంటీర్లు ఆలయ చరిత్రతో పాటు, తెలంగాణలోని చారిత్రాక కట్టడాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. పర్యాటక ప్రాంతాలకు నెలవు ములుగు జిల్లా అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను ప్రొఫెసర్‌ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్‌ ట్రస్ట్‌ సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీనివాస్‌, అసిస్టెంట్‌ టూరిజం ప్రమోషన్‌ ఆఫీసర్‌ కుసుమ సూర్యకిరణ్‌.. రామజన్మభూమి (అయోధ్య) నుంచి తీసుకొచ్చిన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్‌, మిల్కూరి ఐలయ్య, తుమ్మేటి రాజిరెడ్డి, తడాండ్ల గోపాల్‌, చెన్నోజు శ్రీనివాస్‌, జంగిలి రవి పాల్గొన్నారు.



వరల్డ్‌ హెరిటేజ్‌ వలంటీర్లతో మంత్రి సీతక్క

విద్యుత్‌ చార్జీలపై బహిరంగ విచారణ

హన్మకొండ: తెలంగాణ నార్తర్న్‌ పవర్‌ డిస్ట్రిబ్యూషన్‌ కంపెనీ ప్రతిపాదించిన (2024–25 నుంచి 2028–29 ఆర్థిక సంవత్సరం వరకు) విద్యుత్‌ చార్జీలు, సమగ్ర ఆదాయ అవశ్యకత ప్రతిపాదనలపై ఈనెల 24న తెలంగాణ రాష్ట్ర విద్యుత్‌ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ) బహిరంగ విచారణ చేపడుతుందని టీజీ ఎన్పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌ కలెక్టరేట్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు బహిరంగ విచారణ ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్‌ పరిధిలోని 16 సర్కిళ్లకు చెందిన విద్యుత్‌ వినియోగదారులు ఈ విచారణకు హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరారు.

నకిలీ పిస్టల్‌తో బెదిరింపులు

- దేహశుద్ధి చేసిన స్థానికులు
- పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

దామెర : ఓ కిరాణాషాపులోకి వెళ్లి డబ్బులు ఇవ్వాలంటూ నకిలీ పిస్టల్‌తో ఓ వ్యక్తి బెదిరించిన ఘటన మండలంలోని ఊరుగొండలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కందికొండ సంపత్‌ జాతీయ రహదారి పక్కనే నివాసమంటూ కిరాణాషాపును నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి వచ్చి షట్టర్‌ కొడుతుండగా, ఏం కావాలని అడగగా, బిస్కెట్‌ ప్యాకెట్లు కావాలని తెలిపాడు. దీంతో నమ్మిన సంపత్‌ షట్టర్‌ తెరవగానే సదరు వ్యక్తి తన వద్ద ఉన్న నకిలీ పిస్టల్‌ను తీసి సంపత్‌ను బెదిరించాడు. డబ్బులు ఇవ్వాలని లేకుంటే చంపేస్తానంటూ బెదిరించాడు. సంపత్‌ వెంటనే భయంతో తన దగ్గర డబ్బులు లేవంటూనే కేకలు వేశాడు. దీంతో స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరకుని సదరు వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. సదరు వ్యక్తిపై పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సంపత్‌ పేర్కొన్నారు.

వ్యక్తిపై గతంలో పలు కేసులు

డబ్బుల కోసం నకిలీ పిస్టల్‌తో బెదిరించిన వ్యక్తి గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. సదరు వ్యక్తిని పోలీసులు విచారిస్తుండగా, పలు కేసుల వివరాలు బయటకు వస్తున్నట్లు తెలిసింది. ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా నిందితుడిని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇన్సూరెన్స్‌ చెక్కు అందజేత



పద్మకు బీమా చెక్కును అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు

హన్మకొండ: వరంగల్‌ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ద్వారా కర్షక మిత్ర వ్యవసాయ రుణం తీసుకుని మృతి చెందిన రైతు కుటుంబానికి టెస్కాబ్‌, వరంగల్‌ డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు బీమా చెక్కును అందించారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇస్సీపేటకు చెందిన యార రాజారెడ్డి ఇటీవల విద్యుత్‌ షాక్‌తో మృతి చెందాడు. డీసీసీబీ ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులకు బీమా సౌకర్యాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్‌ షాక్‌తో మృతి చెందిన రైతుకు బీమా సంస్థ ఇఫ్కో టోక్యో ఇన్సూరెన్స్‌ కంపెనీ రూ.8 లక్షల క్లెయిమ్‌ మంజూరు చేయగా సోమవారం హనుమకొండలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆ బీమా చెక్కును రాజిరెడ్డి సతీమణి యార పద్మకు రవీందర్‌ రావు అందించారు. డీసీసీబీ సీఈఓ వజీర్‌ సుల్తాన్‌, జీఎం ఉషాశ్రీ, డీజీఎం అశోక్‌, ఏజీఎంలు మధు, రాజు, కృష్ణ మోహన్‌, గొట్టం స్రవంతి, గంప స్రవంతి, ఇఫ్కో టోక్యో ఇన్సూరెన్స్‌ కంపెనీ తెలంగాణ ఇన్‌చార్జ్‌ బిజేశ్‌, వరంగల్‌ మేనేజర్‌ శేషు పాల్గొన్నారు.

ప్రతీ బస్తా కొనుగోలు చేస్తాం

- రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఏనుమాములలో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

వరంగల్‌ : రాష్ట్రంలో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట ఉత్పత్తుల ప్రతీ బస్తాను కొనుగోలు చేస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి యార్డులో వ్యవసాయ, మార్కెటింగ్‌ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్‌.నాగరాజు, కలెక్టర్‌ డాక్టర్‌ సత్యశారదతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్దదైన వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని దేశంలోనే మొదటగా ప్రారంభించుకోవడం సంతోషదాయకమన్నారు. సీఎం రేవంత్‌ రెడ్డి సారథ్యంలో ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చి గరిష్ట ధరను పొందాలని మంత్రి సూచించారు. తేమను దృష్టిలో ఉంచుకొని ధర నిర్ణయించడం జరుగుతున్నందున, తేమ వల్ల రైతులు నష్టపోకుండా పరిశీలించేందుకు కమిటీని నియమించామన్నారు. పత్తి విక్రయించిన మూడు రోజుల్లోనే సంబంధిత రైతు బ్యాంకు అకౌంట్‌లో నేరుగా డబ్బులు జమ అవుతాయన్నారు.

24 గంటలు నాణ్యమైన విద్యుత్‌..

రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రైతుల సంక్షేమం కోసం 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ సరఫరా చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రైతు రుణమాఫీ చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్‌.నాగరాజు అన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.

మొదటి విడతలో 14 కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా 27 కొనుగోలు కేంద్రాలను గుర్తించి మొదటి విడతలో 14 కేంద్రాలు ప్రారంభిస్తున్నామని కలెక్టర్‌ డాక్టర్‌ సత్య శారద తెలిపారు. అందులో భాగంగా వరంగల్‌ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో ప్రారంభం కాగా మిగిలిన నర్సంపేట నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాలను వారంలోగా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తూర్పాటి సులోచన, పోశాల పద్మ, భోగి సువర్ణ, చింతాకుల అనిల్‌, ఉమాదామోదర్‌ యాదవ్‌, అదనపు కలెక్టర్‌ సంధ్యారాణి, సీసీఐ జనరల్‌ మేనేజర్‌ అర్జున్‌ దుబే, మార్కెటింగ్‌ శాఖ జేడీ శ్రీనివాస్‌, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, కాటన్‌ కొనుగోలు అధికారి కృష్ణారెడ్డి, వరంగల్‌ ఛాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కాటన్‌ సెక్షన్‌ అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్‌ సత్యశారద

గీత కార్మికుల భద్రతకే కాటమయ్య కిట్లు

- మంత్రి కొండా సురేఖ

కల్లుగీత కార్మికుల భద్రతకే కాటమయ్య కిట్లు అందిస్తున్నామని మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్‌ ఏనుమాముల మార్కెట్‌ యార్డు ప్రాంగణంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్‌ తూర్పు నియోజకవర్గ కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని కలెక్టర్‌ డాక్టర్‌ సత్య శారదతో కలిసి గీత కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కులవృత్తులకు అన్ని విధాలా చేయూత అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్మికుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 10 వేల మంది గీత కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అంతకుముందు గీత కార్మికుడు ప్రయోగాత్మకంగా కాటమయ్య భద్రత కిట్‌ ధరించి చెట్టు ఎక్కిన తీరును మంత్రి, కలెక్టర్లు పరిశీలించారు. కార్పొరేటర్లు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, జిల్లా అబ్కారీ అధికారి చంద్రశేఖర్‌, గౌడ సంఘ నాయకులు నర్సయ్య, శ్రీనివాస్‌, యుగేంధర్‌ పాల్గొన్నారు.

మిత్రుడిని కాలేజీలో వదిలిపెట్టేందుకు వెళ్తూ..

- బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరి మృతి
- జమాండ్లపల్లిలో ఘటన


మహబూబాబాద్‌ రూరల్‌ : తోటి మిత్రుడిని కాలేజీలో వదిలి పెట్టేందుకు వెళ్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు మిత్రులు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్‌ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి శివారులోని అర్బన్‌ పార్క్‌ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్‌ సీఐ సర్వయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండలం పొనుగోడుకు చెందిన నీల రమేశ్‌, గౌతమి దంపతుల రెండో కుమారుడు అరుణ్‌కుమార్‌ (18) మానుకోటలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులంలో ఇంటర్‌ సెకండియర్‌ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన సంగెం ఉపేందర్‌, మంజుల దంపతుల ఏకైక కుమారుడు మణికంఠ (19) హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్‌ ఫస్టియర్‌ చదువుతున్నాడు. ఇద్దరు మిత్రులు దసరా పండుగకు ఇంటికి వచ్చారు. సెలవులు పూర్తి కాగా అరుణ్‌కుమార్‌ను మానుకోటలోని ఎంజేపీఆర్‌సీలో వదిలిపెట్టేందుకు మణికంఠ ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో వారి బైక్‌ జమాండ్లపల్లి శివారులో గల అర్బన్‌పార్క్‌ ప్రాంతంలోకి చేరుకుంటుండగా ఎదురుగా కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. సరైన దారిలో వస్తున్న ద్విచక్రవాహనాన్ని కారు రాంగ్‌ రూట్‌లో వచ్చి ఢీకొట్టడంతో పాటు కొంత దూరం వరకు దూసుకెళ్లి రోడ్డు పక్కన ఉన్న చెట్లలో పడిపోయింది. ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అయి అరుణ్‌కుమార్‌, మణికంఠలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. రూరల్‌ ఎస్సై దీపికారెడ్డి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను మహబూబాబాద్‌ జనరల్‌ ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు నడుపుతున్న సామ మణికంఠను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం..


కారు ఢీకొన్న ఘటనలో మృతిచెందిన అరుణ్‌ కుమార్‌, మణికంఠ ఇద్దరు బాల్య మిత్రులు కావడంతో పాటు ప్రాణస్నేహితులు. అప్పటి వరకు పొనుగోడులో ఇద్దరు కలిసి తిరిగిన కొద్ది సేపటికే దుర్మరణం చెంది విగతజీవులుగా పడి ఉండడాన్ని చూసిన బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇద్దరు ఒకే రోజు మృతి చెందడంతో మరణంలోనూ వారి బంధం వీడలేదు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

న్యాయం చేయాలని రాస్తారోకో


మిత్రుల మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలని, కారు ఢీకొన్న ఘటనలో మృతిచెందిన అరుణ్‌ కుమార్‌, మణికంఠ కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం రాత్రి మహబూబాబాద్‌లోని అండర్‌ బ్రిడ్జి ప్రాంతంలో మృతుల బంధువులు, గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న టౌన్‌, రూరల్‌ సీఐలు దేవేందర్‌, సర్వయ్య, రూరల్‌ ఎస్సై దీపికారెడ్డి రాస్తారోకో వద్దకు చేరుకుని మృతుల బంధువులు, గ్రామస్తులతో మాట్లాడారు. తమకు న్యాయం జరిగేంత వరకు రాస్తారోకో విరమించమని వారు చెప్పగా సీఐ సర్వయ్య ఫోన్లో డీఎస్పీ తిరుపతిరావుతో మాట్లాడించారు. దీంతో మృతుల బంధువులు, గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.



రాస్తారోకో చేస్తున్న మృతుల బంధువులు, గ్రామస్తులు



అరుణ్‌కుమార్‌ (ఫైల్‌)



మణికంఠ (ఫైల్‌)